డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



రాజీవ్‌గాంధీ నగర్‌లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



మోతీనగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ నగర్‌లో భూగర్భ డ్రైనేజీ పొంగిపొర్లుతుండటంపై స్థానికులు, 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన గురువారం అధికారులతో కలిసి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ పొంగి మురుగునీరు ఇళ్లల్లోకి చేరుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీలైనంత త్వరగా డ్రైనేజీ పనులను పూర్తి చేయాలన్నారు. జలమండలి అధికారులు నల్లా కనెక్షన్లు కట్ చేస్తున్నారని, ఒక్కొక్కరి నుంచిరూ. 5 నుంచి 10 వేల వరకు బిల్లులు కట్టాల్సిందేనని ఒత్తిడి చేస్తున్నారని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ 20వేల లీటర్ల మంచినీరు వాడుకోవచ్చని గత ప్రభుత్వం జీవో జారీ చేసిందని తెలిపారు. అయినా జలమండలి అధికారులు గత ప్రభుత్వంలో వాడుకున్న నీటికి కూడా డబ్బులు కట్టమని వేధించడం దారుణమన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, వీరారెడ్డి, సయ్యద్ రియాజ్, రమేష్, ముత్యాల దుర్గ, జీహెచ్‌యంసి అధికారులు, డిఈ ఆనంద్, ఏఈ రంజిత్, జలమండలి అధికారులు విలియం ప్రకాష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై అలసత్వం తగదు



మాట్లాడుతున్న కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డివిజన్ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ అన్నారు. గురువారం జీహెచ్‌ఎంసీ శానిటేషన్ స్వీపింగ్, రామ్‌కీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. పేరుకుపోయిన చెత్తను తొలగించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. భవాని నగర్ అంజయ్య నగర్, హస్మత్ పేట్, ఓల్డ్ బోయిన్‌పల్లి వంటి పలు బస్తీలు, కాలనీల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రతిరోజు ఆయా ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ మమత, సూపర్‌వైజర్ మనోహర్‌రెడ్డి, జవాన్ బుజ్జి, చైతన్య, శ్రీకాంత్‌రెడ్డి, అరుణ, శంకర్, శ్రీనివాస్, సంపత్, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి



ఎల్లమ్మబండలో పర్యటిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరాంచాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన మేడ్చల్ జోన్ సీజీఎం సాయిబాబాతో కలిసి ఎల్లమ్మబండ ప్రాంతాల్లో పర్యటించి విద్యుత్ సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కొన్నిచోట్ల విద్యుత్ వైర్లు, స్తంభాలు మార్చాలని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, పాత ట్రాన్స్‌ఫార్మర్లకు చుట్టూ ఫెన్సింగ్ వేయాలని కోరారు. కొన్ని చోట్ల రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డీఈ చక్రవర్తి, ఏడీఇ ప్రసాద్, భాగ్యనగర్ ఏఈ షాబాజ్ తదితరులు పాల్గొన్నారు.

కేశవనగర్ ప్రభుత్వ పాఠశాలలో 'ప్రాజెక్ట్ ప్రజ్ఞా'

'మంథన్' విద్యార్థుల ఔదార్యం




రాయదుర్గం: 'మంథన్' పాఠశాల విద్యార్థులు ఔదార్యం ప్రదర్శించారు. ఒకవైపు విద్యనభ్యసిస్తూ ఇంకోవైపు సేవాభావంతో అడుగులు వేస్తున్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గౌలిదొడ్డి కేశవనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 'ప్రాజెక్ట్ ప్రజ్ఞా' పేరుతో విద్యావ్యాప్తి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కేంబ్రిడ్జ్ బోర్డులోని 9వ తరగతి విద్యార్థులు పది మంది ,ఉపాధ్యాయులు అయిదుగురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో 1నుంచి 5 తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్, సైన్స్, గణితం, శారీరక విద్య (పీఈటీ) బోధనపై దృష్టి సారించారు. స్టేషనరీ కిట్లు, నోట్‌బుక్స్, బోధన సామగ్రి అందించారు. ఈ సందర్భంగా మంథన్ స్కూల్ ప్రిన్సిపల్ సుర్జీత్‌సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడం అవసరమన్నారు. ప్రతి బిడ్డ మన దేశభవిష్యత్తు అని మనం గుర్తించాలన్నారు.

ఓబీసీ గీత సెల్ కన్వీనర్‌గా డా.వెంకటేష్‌గౌడ్

సుభాష్‌నగర్: తెలంగాణ బీజేపీ ఓబీసీ గీత సెల్ కన్వీనర్‌గా డాక్టర్ పటేల్ వెంకటేష్‌గౌడ్ నియమితులయ్యారు. గురువారం ఓబీసీ రాష్ట్ర ప్రెసిడెంట్ గంధమల్ల ఆనంద్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకటేష్‌గౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. అదే విధంగా కో.కన్వీనర్లుగా రాగుల కిరణ్‌కుమార్‌గౌడ్, బూర్ర మన్సూర్‌గౌడ్, మీరకంటి మీరయ్యగౌడ్, తిరుమల కృష్ణగౌడ్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రెసిడెంట్ సంజయ్, జనరల్ సెక్రటరీ దివాకర్, మాజీ కన్వీనర్ పంజాల శ్రవణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి

గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి



గోపన్‌పల్లిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని గోపన్‌పల్లిలో రూ.30 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు, రాజీవ్‌నగర్‌లో రూ.15 లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాణ్యత విషయంలో రాజీపడకుండా నిర్ణీత సమయంలో సీసీరోడ్డు, డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికే బస్తీబాట కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఆయన స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హన్మంతు నాయక్, శ్రీనివాస్, ప్రభాకర్, మురగ, ఎం రమేష్, రంగస్వామి, శ్రీకాంత్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, మల్లేష్, గోపన్‌పల్లి, రాజీవ్‌నగర్‌వాసులు పాల్గొన్నారు.

గోపన్‌పల్లి తండా గోడు పట్టదా ?



- అభివృద్ధిని మరిచిన పాలకులు
- అందుబాటులోకి రాని మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్
- పదేళ్లు గడుస్తున్నా మినీ వైకుంఠ మహాప్రస్థానం పూర్తి కాలేదు
- ఫ్లైఓవర్‌ను ప్రారంభించేదెన్నడో..

రాయదుర్గం: ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు చేరువలోనే ఉన్న గోపన్‌పల్లితండాలో స్థానికులకు అభివృద్ధి పనులు దరి చేరడం లేదు. మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి మెరుగుదల కనిపించడం లేదు. గిరిజనులు అత్యధిక సంఖ్యలో నివసిస్తున్నా అభివృద్ధి అంతంతమాత్రంగానే ఉంది.

- గోపన్‌పల్లితండాలో ఒకప్పుడు చిన్నచిన్న ఇళ్లు మాత్రమే ఉండేవి. రియల్ వ్యాపారం పుంజుకోవడంతో బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి. ఇళ్లలో మార్పు వచ్చినా సౌకర్యాలు మెరుగుపడలేదు.
- గోపన్‌పల్లితండా చెంతనే విప్రో ఐటీ సంస్థ, టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సెంటర్ ఉన్నా, స్థానికులకు ఆశించిన స్థాయిలో ఉద్యోగ అవకాశాలు రాలేదు.
- చిన్నా పెద్దచెరువు పక్కనే కోట్లాది రూపాయల వ్యయంతో ఎస్టీపీ నిర్మించారు. కానీ స్థానికంగా డ్రైనేజీ సమస్య పూర్తి స్థాయిలో పరిష్కరించలేదు. దీంతో మురుగునీరంతా చెరువులోకే వెళుతోంది. చెరువును కలుషితం చేయవద్దని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.
- తండా కూడలి నుంచి ఔటర్‌రింగురోడ్డు వరకు రోడ్డు విస్తరణ చేసినా డివైడర్‌పై గ్రీనరీ, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయలేదు..
- గోపన్‌పల్లి– గోపన్‌పల్లితండా మధ్యన ఉండే చిన్నాపెద్దా చెరువు సుందరీకరణ పూర్తిగా మరిచి పోయారు. ఒకవైపు వాకింగ్‌ట్రాక్ నిర్మించి ఫెన్సింగ్ వేసినా దాన్ని జరుపుతూ ఆక్రమణలు చేస్తున్నారు.

స్థానికుల డిమాండ్లు ఇవే...

- భూములు కోల్పోయిన వారికి స్థానికంగా ఏర్పడిన సంస్థల్లో ఉద్యోగాలు ఇవ్వాలి.
- రూ.2కోట్లతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను వెంటనే అందుబాటులోకి తేవాలి.
- స్థానికంగా ఇళ్ల మధ్యనుంచి వెళుతున్న నాలాను పూర్తి స్థాయిలో బాగుచేయాలి
- రూ.రెండు కోట్లతో మినీ వైకుంఠ మహాప్రస్థానం పనులు పూర్తిచేసి అందుబాటులోకి తేవాలి
- ఫ్లైఓవర్‌ను వెంటనే ప్రారంభించాలి
- మల్టీ ఫంక్షన్‌హాల్ నిర్మించిన చోట ఉన్న ఖాళీ స్థలంలో మినీ స్టేడియం నిర్మాణం చేయాలి..
- పారిశుధ్య వ్యవస్థను మరింత మెరుగుపరచాలి.



గోపన్‌పల్లితండా ప్రధాన రోడ్డు



ప్రారంభానికి నోచుకోని ఫ్లైఓవర్ ఇదే..



ఎనిమిది నెలలుగా అందుబాటులోకి రాని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్

నేడు జేఎన్‌టీయూలో ఒక్కరోజు సెమినార్

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ సివిల్ డిపార్టుమెంట్ సీనియర్ ప్రొ. డా. జీకే విశ్వనాథ్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఈనెల 28వ తేదీన ఉదయం 9.30 గంటలకు ఒక్కరోజు సెమినార్‌ను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ బుర్రా వెంకటేశం, గౌరవ అతిథిగా రెక్టార్ డా. కె. విజయకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డా. కె. వెంకటేశ్వరరావు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రొ. డా. జీకే విశ్వనాథ్‌కు సత్కార కార్యక్రమం ఉంటుందన్నారు.

పీవీ నరసింహారావు గొప్ప రాజనీతిజ్ఞుడు

చిక్కడపల్లి: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గొప్ప రాజనీతిజ్ఞుడని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు కొనియాడారు.త్యాగరాయగానసభ నిర్వహణలో కళా సుబ్బారావు కళావేదికలో గురువారం నిర్వహించిన భారత పూర్వ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా జస్టిస్ కాశీవిశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణలకు అద్యుడన్నారు. మైనార్టీ ప్రభుత్వాన్ని నడిపిన ఆయన అపర చాణిక్యుడని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి, సీహెచ్ త్రినాథరావు, వైకుంఠం, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రేపటి నుంచి జాతీయ సదస్సు

కాచిగూడ: మార్వాడి శిక్షా సమితి, రామ్‌నాథ్ గుల్జారీలాల్ కేడియా కాలేజ్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సహకారంతో ఈనెల 28, 29 తేదీల్లో కాచిగూడలోని కళాశాలలో భవిష్యత్ వ్యాపార ధోరణులు, అత్యాధునిక ఆవిష్కరణలపై జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కామర్స్ విద్యార్థులు సెమినార్‌లో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

వికలాంగుల కోసం ప్రత్యేక విద్యా పాలసీ ఏర్పాటు చేస్తాం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వికలాంగుల విద్య కోసం ప్రత్యేక విద్యా పాలసీని ఏర్పాటు చేస్తామని, వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్(టీవీసీసీ) చైర్మన్ ముత్తినేని వీరయ్యవర్మ అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ, హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో వికలాంగుల విద్య, స్థితిగతులు, ప్రభుత్వం పాత్ర అనే అంశంపై సదస్సు జరిగింది. ముత్తినేని వీరయ్య వర్మ మాట్లాడుతూ... 1985లో కేంద్ర సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వ శాఖ వికలాంగులకు విద్య కోసం ప్రాంతీయ పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు.

సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం



ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ హిల్స్ కాలనీకి చెందిన భీమరాజుకు వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన ఎల్‌ఓసీ పత్రాలను గురువారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యవసర వైద్య చికిత్సకు బాధితుడు దరఖాస్తు చేసుకోగా అందుకు సంబంధించిన రూ.75 వేలు మంజూరు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను కొనసాగిస్తుందన్నారు. ప్రజా క్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థిక భరోసా ఇస్తుందని తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు

కవాడిగూడ: చట్ట వ్యతిరేకంగా బౌన్సర్ల పేరుతో రౌడీలను, గుండాలను అక్రమంగా నియమించుకొని అక్రమంగా డోనేషన్లు వసూలు చేస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై దాడులకు పాల్పడుతున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకొని వాటి గుర్తింపును రద్దు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్‌ముదిరాజ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనగల శ్యాంకురామ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్‌ను బీసీ ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రైవేటు కళాశాలలు ముఖ్యంగా ఇంజనీరింగ్ కళాశాలల యజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా డోనేషన్ల పేరుతో లక్షల రూపాయలు దండుకుంటూ, మెరిట్ ఉన్నటువంటి విద్యార్థులకు సీట్లు ఇవ్వకుండా నిరాకరిస్తున్నారన్నారు.

ముంపు సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి

వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి



వాటర్ లాగింగ్ పాయింట్లను పరిశీలిస్తున్న వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలోని ఆయా సర్కిళ్ల పరిధిలో ముంపు సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఇంజనీరింగ్, బయోడైవర్సిటీ, విద్యుత్, శానిటేషన్ అధికారులతో కలిసి ఆయన సుడిగాలి పర్యటన చేశారు. వాటర్ లాగింగ్ పాయింట్లతో పాటు బాక్స్ డ్రైయిన్ నిర్మాణాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలం పూర్తయ్యే వరకు సంబంధిత విభాగాల అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదేశించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. నాలాల్లో పూడిక తీయాలని, మ్యాన్‌హోళ్లు, నాలాలు, కల్వర్టుల వద్ద ప్రమాదాలు జరకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.భారీ వర్షం వచ్చినప్పుడు వరదకు అడ్డుగా ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని, కొన్ని విద్యుత్ స్తంభాలను మార్చాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ఈదురు గాలులు, భారీ వర్షాలకు చెట్లు విరగడం, గ్రీన్ వేస్ట్‌ను వెంటనే తొలగించేలా సహాయక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ డీసీ రజినీకాంత్‌రెడ్డి, జోన్ ఎస్‌ఈ శంకర్, ఈఈ శ్రీనివాస్,ఏసీపీ మెహ్రా, ఏఎంఓహెచ్ డాక్టర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్‌బీ ఆధ్వర్యంలో 'పాలసీవాక్'

రాయదుర్గం: విధాన రూపకల్పన, అమలులో ప్రత్యక్ష అనుభవాన్ని పొందడానికి వినూత్న కార్యక్రమాన్ని గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లోని భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ, అడ్వాన్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ఇన్ పబ్లిక్ పాలసీ విద్యార్థులు మూడు రోజుల పాటు పబ్లిక్ పాలసీ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని న్యూఢిల్లీలో నిర్వహించారు. ఈ కార్యక్రమం గురువారం ముగిసింది. ఐఎస్‌బీ పబ్లిక్ పాలసీ డైరెక్టర్ డాక్టర్ ఆరుషిజైన్ ఆధ్వర్యంలోని విద్యార్థులు, ప్రొఫెసర్ అంజల్‌ప్రకాశ్ పర్యవేక్షణలోజరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, నీతి ఆయోగ్ సీఈఓ బివిఆర్ సుబ్రహ్మణ్యం ,వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. భారతదేశంలో పౌరసేవల నిర్వహణ, దేశవ్యాప్తంగా గ్రామీణ పారిశుద్ధ్యం, పోర్టబుల్ నీటి సరఫరా సవాళ్ళు, పురోగతి, భారత్–బెల్జియం దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, చిక్కులు, భారత్‌లో ఎన్నికల విధానం, దేశంలో సమర్థవంతమైన పాలన వంటి అంశాలపై చర్చించారు. వారి అభిప్రాయాలను ప్రకటించారు.

నేడు అమ్మవారికి నవకలశ స్థపనం

మోతీనగర్: కబీర్‌నగర్, అవంతినగర్, మోతీనగర్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీ శివరామాంజనేయ స్వామి దేవాలయంలో ఈ నెల 28న ఉదయం 7 లలిత పరమేశ్వరి అమ్మవారికి జ్యేష్ఠమాసం సందర్భంగా నవకలశ స్థపనం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారు విశేష అలంకరణతో దర్శనమిస్తారన్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన



ఎల్‌బి శాస్త్రి నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్‌లోని ఎల్‌బి శాస్త్రి నగర్‌లోని లోతట్టు ప్రాంతాల్లో వర్షాకాలంలో ఇళ్లల్లోకి నీరు వచ్చి చేరుతుందని స్థానికులు కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన జీహెచ్ఎంసీ ఏఈ పవన్‌తో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. రెండు అడుగుల పైపులైన్ వేసి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అఫ్జల్, బెట్టు శ్రీను, నరేందర్‌నాయుడు, ఖాజా పాల్గొన్నారు.

రైతు బజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి రైతు బజార్‌లో కూరగాయల ధరలు గురువారం 1కిలోకి ఈ విధంగా ఉన్నాయి. టమాట రూ. 43, వంకాయ 35, బెండకాయ 50, పచ్చిమిర్చి 65, బజ్జిమిర్చి 50, కాకరకాయ 52, బీరకాయ 35, క్యాబేజి 23, బీన్స్ 105, క్యారెట్ 40, గోబిపువ్వు 23, దొండకాయ 18, చిక్కుడుకాయ 65, గోరుచిక్కుడు 50, బీట్‌రూట్ 23, క్యాప్సికం 65, ఆలుగడ్డ 37, కీరా 23, దోసకాయ 23, సొరకాయ 11, పొట్లకాయ 18, కంద 50, ఉల్లిపొరక 65, ఉల్లిగడ్డ 39, మామిడికాయ 10 నుంచి 20, అరటికాయ 8 నుంచి 10, చామగడ్డ 35, ముల్లంగి 4 నుంచి 5, చిలగడ దుంప 40, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు 50 నుంచి 60, మునగకాయలు 8 నుంచి 10, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 240, చింతపండు 140, పండుమిర్చి 80, ఉసిరి 60, వేరుశెనగ నూనె 165, పామాయిల్ నూనె 97.

ఆర్‌టీసీ ఉద్యోగుల పిల్లలకు బహుమతుల ప్రదానం

మూసాపేట: ఆర్‌టీసీ ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా ఉన్నప్పుడే రెట్టింపు ఉత్సాహంగా పనిచేస్తారని కూకట్‌పల్లి ఆర్ఎం కవిత అన్నారు. గురువారం కూకట్‌పల్లి డిపోలో ఏప్రిల్, మే నెలలో అధిక ఆదాయం తెచ్చిన ఉద్యోగులకు అవార్డులు, బహుమతులు అందించారు. ఉద్యోగస్తుల పిల్లలకు వివిధ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. గత నెలలో వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఇషాక్ బిన్ మహ్మద్, సీఐ శ్రీలత, ఎంఎఫ్ రాజేశ్వరి, ఉద్యోగస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



బాలానగర్, పూల్‌బాగ్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి తదితరులు

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని పూల్‌బాగ్ కాలనీలో జరుగుతున్న వీడీసీసీ రోడ్డు పనులను గురువారం బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. రోడ్డుపై నీరు నిలవకుండా లెవెలింగ్ మెయిన్‌టైన్ చేస్తూ, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌యంసీ డీఈ బాలకిషన్, ఏఈ మొహమ్మద్ రషీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు, కాలనీ అధ్యక్షులు సభాపతి రెడ్డి, అనిల్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, బాల్ రెడ్డి, భగవాన్, మల్లా రెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మూసాపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కుత్బుల్లాపూర్‌లో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి అర్హత కలిగి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.ఎకనామిక్స్,హిస్టరీ, రాజనీతి శాస్త్రం, కంప్యూటర్ సైన్స్,మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, బాటనీ, జువాలజీ సబ్జెక్టుల్లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుగా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ అలివేలు మంగ గురువారం ఓ ప్రకటనలో తెలిపార. అర్హత కలిగిన అభ్యర్థులు జులై 1న సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో 55 శాతం నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. అభ్యర్థులు 12నుంచి 5గంటల లోపు కళాశాల కార్యాలయంలో తమ దరఖాస్తులను అందజేయాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

అంబేడ్కర్ లా కళాశాలకు రెండో స్థానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇండియా టుడే ప్రకటించిన ర్యాంకింగ్‌లో బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ లా కళాశాలకు రెండవ స్థానం లభించినట్లు అంబేద్కర్ విద్యా సంస్థల చైర్మన్ జి.వివేక్, కార్యదర్శి జి.వినోద్‌లు తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అంబేద్కర్ లా కళాశాల రాష్ట్రంలో రెండవ స్థానం, జాతీయ స్థాయిలో ఐదవ స్థానం సాధించి బెస్ట్ కాలేజీగా గుర్తింపు తెచ్చుకుందని తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ విద్యా సంస్థల్లో వసతులు, టీచింగ్, చదువుకునే వాతావరణం తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని ఇండియా టూడే సంస్థ మంగళవారం ర్యాంకులను ప్రకటించిందని తెలిపారు.